క్లుప్తంగా

తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలి



పన్ను వసూలు చేస్తున్న డీపీవో శ్రీనివాస్

ఇంద్రవెల్లి: దుకాణదారులు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మేజర్ గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి వ్యాపార దుకాణాల వద్ద పన్ను వసూలు చేయడంతో పాటు లైసెన్స్ తీయించారు. క్రమం తప్పకుండా పన్ను చెల్లించి గ్రామపంచాయతీ అధికారులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సంతోశ్‌కుమార్, పంచాయతీ ఈవో సంజీవ్‌రావ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని గ్రామపంచాయతీ తంతోలి సొసైటీగూడలో శుక్రవారం జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో గెలుపొందిన జట్లకు నగదు, ట్రోఫీ అందజేశారు. మొదటి బహుమతి జోగు ఫౌండేషన్ తరఫున రూ.15వేలను చిట్యాలబోరి జట్టుకు అందజేశారు. రెండో బహుమతి ఎంపీటీసీ లక్ష్మి జగదీష్ యాదవ్ రూ.10వేలు కేఆర్‌కే జట్టుకు, మూడో బహుమతి ఏఎంసీ డైరెక్టర్ ఫిరంగి మల్లేష్ రూ.5వేలను సొసైటీ గుడా జట్లకు ఎంపీపీ గంగ్ర రమేష్ చేతుల మీద అందజేశారు. కార్యకరమంలో డీసీసీబీ డైరెక్టర్ మెస్రం పరమేశ్వర్‌రావు, చిట్యాలబోరి సర్పంచ్ వసంత్, గ్రామ పటేల్ లక్కూ, అరవింద్, మచందర్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీ లేని సిగరెట్లు అమ్మవద్దు

ఆదిలాబాద్‌టౌన్: ఎమ్మార్పీ లేని సిగరెట్ ప్యాకెట్లు అమ్మవద్దని జిల్లా పొగాకు నియంత్రణ అధికారి శ్రీకాంత్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు దుకాణాల యజమానులకు శుక్రవారం అవగాహన కల్పించారు. నో స్మోకింగ్, క్యాన్సర్ బొమ్మలతో కూడిన హెచ్చరిక లేని పొగాకు ఉత్పత్తులు అమ్మడం చట్టవిరుద్ధమన్నారు. ఆయన వెంట సామాజిక కార్యకర్త చిరంజీవి, తదితరులు ఉన్నారు.

బీజేపీ సంబురాలు

ఉట్నూర్‌రూరల్: మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డి గెలుపొందడంతో మండల బీజేపీ నాయకులు విజయోత్సవ సంబురాలు జరుపుకున్నారు. జాతీయ నాయకులు శ్రీరామ్‌నాయక్ మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏవీఎన్ రెడ్డి పోరాడుతారని, బీఆర్‌ఎస్‌పై వస్తున్న వ్యతిరేకతకు ఈగెలుపే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రమేశ్, రాంచందర్, దేవిదాస్, జగన్, గంగన్న, ధన్‌లాల్, లింగన్న, భూపతి పాల్గొన్నారు.

లాభసాటి పంటలు సాగు చేయాలి



జొన్న పంటను పరిశీలిస్తున్న పుల్లయ్య

ఇచ్చోడ: రైతులు లాభసాటి పంటల సాగు చేయాలని జిల్లా వ్యవసాయధికారి పుల్లయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని నర్సాపూర్‌లో జొన్న పంటను పరిశీలించారు. ప్రతీ ఏడాది పంటల మార్పిడి చేయాలని, నాణ్యమైన విత్తనాలను విత్తుకోవాలన్నారు. మోతాదుకు మించి రసాయనికి ఎరువుల వినయోగించవద్దన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రాంకిషన్, ఏఈవో మణిషాగౌడ్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

జైనథ్: పరిసరాల పరిశుభ్రత పాటించాలని జైనథ్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నైనత అన్నారు. శుక్రవారం మండలంలోని దీపాయిగూడ ప్రాథమిక, జెడ్పీ ఉన్నత పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులను పరీక్షించి, అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వేణు, సిబ్బంది పాల్గొన్నారు.

కరంజిలో కంటి వెలుగు..

మండలంలోని కరంజి గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని మెడికల్ ఆఫీసర్ నైనత ప్రారంభించారు. పలువురికి కంటి పరీక్షలు నిర్వహించి, కళ్లద్దాలు అందజేశారు. ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

విజయవంతం చేయండి

ఎదులాపురం: జిల్లా నుంచి ప్రారంభం కానున్న జన చైతన్య యాత్రను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం పోస్టర్ ఆవిష్కరించారు. 23న పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి బైక్ ర్యాలీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్, ఆశన్న పాల్గొన్నారు.

ముమ్మరంగా సీసీరోడ్ల నిర్మాణం



బొందిడిలో సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ ఈఈ మహావీర్ (ఫైల్)

- యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభం
- ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున హడావుడి



నేరడిగొండలో ఇటీవల వేసిన సీసీరోడ్డు

నేరడిగొండ: మా ఊరికి రోడొచ్చింది.. వెంటనే పూర్తి చేయాలి.. చాలా రోజులుగా ఎదురు చూస్తున్నాం.. అంటూ గ్రామాల ప్రజలు సంతోశాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఏ గ్రామంలో చూసినా.. సీసీ రోడ్ల పనులు యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయి. నాలుగేళ్లుగా పంచాయతీలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగకపోవడంతో జనం బేజారెత్తిపోయిన తరుణంలో తాజాగా రోడ్లు వేయడంతో ఆనందంలో నిండిపోయారు. ఆదిలాబాద్ జిల్లాలోని జైనథ్, బజార్‌హత్నూర్, భీంపూర్, బోథ్, ఇచ్చోడ, గుడిహత్నూర్, నేరడిగొండ, సిరికొండ, తలమడుగు, తాంసి మండలాల్లో 179 పనులకు గాను రూ.13 కోట్ల 78 లక్షల వ్యయంతో రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. ఏ గ్రామ పంచాయతీలో చూసినా.. సీసీ రోడ్లు వేయడంతో సందడి కనిపిస్తోంది. ప్రతీ గ్రామ పంచాయతీకి రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు నిధులు మంజూరు కావడం విశేషం. ఈనెలాఖరు వరకు పనులు పూర్తిచేయాలని లక్ష్యం ఉండడంతో యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడుతున్నారు. పనుల్లో సైతం నాణ్యత ప్రమాణాలు పాటించాలని, నిధులు సక్రమంగా వినియోగించాలని, అధికారులు సైతం పనులను పర్యవేక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలకు సమాధానం చెప్పలేకపోయాం



ఇన్ని రోజులు చాలా ఇబ్బంది పడ్డాం. ఒక్క రోడ్డు కూడా వేయలేదు. సర్పంచ్‌గా గెలిచి ఏం చేశావంటే సమాధానాలు ఇచ్చే పరిస్థితి లేదు. తాజాగా వచ్చిన రోడ్లు జనానికి సమాధానంగా మారాయి. ఒక్కసారిగా రోడ్లు పంచాయతీలకు వరంగా రావడం విశేషం.

– జాదవ్ కల్యాణి మహేందర్, సర్పంచ్, సవర్గాం

త్వరితగతిన పూర్తి చేయాలి



రోడ్ల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి. ఆర్థిక సంవత్సరం పూర్తి కావస్తున్న తరుణంలో రోడ్లకు వచ్చిన నిధులు వెనక్కి వెళ్లకుండా ఉండాలంటే వెంటనే పూర్తి చేయాలి. ఇందుకు గ్రామ సర్పంచ్ పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి. దగ్గరుండి నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాలి.

– రాథోడ్ సజన్, ఎంపీపీ, నేరడిగొండ

అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయం

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌రూరల్: అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శుక్రవారం మావల మండల కేంద్రంలోని మసీద్ వద్ద రూ.20 లక్షలతో కమర్షియల్ మడిగలతో పాటు మరో రూ.10 లక్షలతో ఖబ్రస్తాన్ ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మసీద్‌ల అభివృద్ధి, ఇతర పనులకు రూ.17 కోట్లతో పనులు చేపడుతున్నామన్నారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, రాష్ట్రంలో మరోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జెడ్పీటీసీ నల్ల వనిత, మైనారిటీ కమీషన్ సభ్యుడు అథరుల్లా, సర్పంచ్ డొగ్గలి ప్రమీల, ఏవన్, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, సాజిద్, నల్ల రాజేశ్వర్, రాజేశ్వర్, గంగుల కిరణ్, మహేందర్, ఆసిఫ్, అజీమ్, హబీబ్, ఉమాకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: సీఎం కేసీఆర్ అన్ని మతాలకు సమ ప్రాధాన్యత ఇస్తున్నారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శుక్రవారం పట్టణంలోని సుభాష్‌నగర్, రాంనగర్, కేఆర్‌కే కాలనీలోని మక్కా మసీద్, భుక్తాపూర్‌లోని దారుల్ ఉలుమ్ మహ్మదియా, వడ్డెర కాలనీలోని ఉస్మానియా మసీద్‌లో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, బీఆర్‌ఎస్ నాయకులు సలీమ్, మంజూర్ మౌలాన, జహూర్, ఎజాజ్, మోయిజ్, రాజు పాల్గొన్నారు.

ప్రీమియం తక్కువ.. బోనస్ ఎక్కువ

బేల: తపాలా శాఖ అందిస్తున్న తపాలా జీవిత బీమా (పీఎల్ఐ), గ్రామీణ తపాలా జీవిత బీమా (ఆర్‌పీఎల్ఐ) పథకాలు ఎంతో లాభదాయకంగా ఉంటాయని తపాలా ఇన్‌స్పెక్టర్ సుజిత్ అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈనెల 15 నుంచి 24 వరకు తపాలా బీమా పాలసీల మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా శుక్రవారం బేలలో ప్రచారం నిర్వహించారు. సుకన్య సమృద్ధి, రికరింగ్ డిపాజిట్, సేవింగ్స్ ఖాతా, జీవిత బీమా పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో పీఎల్ఐ డెవలప్‌మెంట్ ఆఫీసర్ నవనీత్, ఎంవో భరత్, బీపీఎంలు దిగంబర్, ప్రణీత్, లక్ష్మణ్, వినయ్ పాల్గొన్నారు.

పోస్ట్‌లో భద్రాచలం సీతారాముల తలంబ్రాలు

భద్రాచలం సీతారాముల తలంబ్రాలను కేవలం రూ.150కే ఇంటికి పంపిస్తామని తెలిపారు. ఈనెల 28 లోపు సమీప పోస్టుమెన్‌కు వివరాలు అందిస్తే, కల్యాణం జరిగిన తర్వాత తలంబ్రాలు పోస్ట్ ద్వారా ఇంటికే పంపించడం జరుగుతుందన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న జడ్జి హుస్సేన్

బోథ్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని బోథ్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి హుస్సేన్ అన్నారు. శుక్రవారం మండలంలోని బాబెర గ్రామంలో చట్టాలపై అవగాన కల్పించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో పురుషులతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛ అవార్డు గ్రహీత ఆత్రం సుశీలను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేశ్, న్యాయవాదులు శంకర్, హరీష్, విజయ్ పాల్గొన్నారు.

కంటివెలుగు సందర్శన



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

తాంసి: భీంపూర్ మండలంలోని మార్కగూడలో కొనసాగుతున్న కంటివెలుగు శిబిరాన్ని ఎంపీడీవో శ్రీనివాస్ శుక్రవారం సందర్శించారు. శిబిరానికి వస్తున్న ప్రజలకు కల్పిస్తున్న వసతులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి నర్మద, వైద్యసిబ్బంది గంగాధర్, జ్ఞానేశ్వర్, పంచాయతీ కార్యదర్శి శ్రీవాణి పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల డిగ్రీ కళాశాలలో శుక్రవారం కంటివెలుగు శిబిరం నిర్వహించారు. వైద్యులు బి.నరేష్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి, కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రభుజ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ సబితా, అప్తాల్మాజిస్ట్ సీహెచ్.పూజ, డీఈవో వెంకటేశ్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు గడువు పొడిగింపు

బోథ్: సాంఘిక, గిరిజన, బీసీ విద్యాసంస్థల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి సంబంధించిన దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం మార్చి 20 వరకు పొడగించిదని టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ ప్రిన్సిపాల్ స్వర్ణలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈవిషయాన్ని గమనించాలని కోరారు.

పర్యావరణాన్ని కాపాడాలి

బోథ్: పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని పక్షి ప్రేమికుడు వెంకటేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వేదం పాఠశాలలో విద్యార్థులకు ప్లాస్టిక్ నిర్మూలన, ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ, మొక్కలు నాటడం, పక్షులను కాపాడుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ సంతోశ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి

నేరడిగొండ: గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీటీసీ పండరి అన్నారు. శుక్రవారం మండలంలోని వడూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో బోర్ వేయించి మోటార్‌ను బిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకు రావాలన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

ఇంద్రవెల్లి: మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన, తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్క బాపురావ్ కాంగ్రెస్‌లో చేరారు. గురువారం రాత్రి బజార్‌హత్నూర్ మండలంలోని పిప్రి గ్రామం నుంచి ప్రారంభమైన పీపుల్ మార్చ్ పాదయాత్రలో మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావ్, సీఎల్పీ నేత బట్టి విక్రమార్కల ఆధ్వర్యంలో చేరారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా అభివృద్ధి చెందుతుందన్నారు.

హనుమాన్ దీక్షల స్వీకరణ



దీక్షలు స్వీకరిస్తున్న భక్తులు

బేల: మండలంలోని సిర్సన్న సింగాపూర్ హనుమాన్ ఆలయంలో శుక్రవారం ఆదిలాబాద్, జైనథ్, బేల మండలాల్లోని భక్తులు 21 రోజుల హనుమాన్ దీక్షల స్వీకరణకు బారులు తీరారు. పూజారి దినేశ్ చౌదరి ప్రత్యేక హోమ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తుల చేతులకు కంకణాలు కట్టి, మాలధారణతో 21 రోజుల అర్ధమండల దీక్ష స్వీకరించారు.

అటెన్షన్ ప్లీజ్.. వంతెన నిర్మించండి..



బోథ్: మండల కేంద్రంలోని సాయినగర్‌లో ఉన్న కాలువపై వంతెన నిర్మించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. వర్షాలు పడితే కాలువ నీరు కాలనీలో వస్తోందని వాపోతున్నారు. అలాగే కాలువ దాటేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నామన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

- సంబంధిత అధికారి: అంజయ్య, పంచాయతీ కార్యదర్శి, ఫోన్: 99853 46280

కుట్టు శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కుమ్ర ఈశ్వరీబాయి

ఇంద్రవెల్లి: విద్యార్థులు, యువతులు, మహిళలు వివిధ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచితకుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వనవాసీ కల్యాణ్ పరిషత్ నాగోబా విద్యార్థి నిలయంలో విజయ్‌కుమార్ ఆగర్వాల్ సహకారంతో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ముందుగా మహానీయుల చిత్రపటాలకు కొవ్వొత్తులు వెలిగించి జ్యోతి ప్రజ్వలన చేశారు. జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, నాగోబా విద్యార్థి నిలయం అధ్యక్షుడు మారుతి డోంగ్రె, నాయకులు కనక తుకారం, సిడాం భీంరావ్ ,వ్యాపారస్తులు చింతవార్ ప్రకాష్, రాంరెడ్డి పాల్గొన్నారు.

సబ్సిడీపై కోడి పిల్లల పంపిణీ



కోడిపిల్లలు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి శ్రీకాంత్

తాంసి: మండల కేంద్రంలోని పశువైద్యశాల ఆవరణలో పశు వైద్యాధికారి శ్రీకాంత్ కోళ్ల పెంపకందారులకు కోడి పిల్లల యూనిట్లు పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా రాయితీపై 20 యూనిట్లు మంజూరయ్యాయి. ఒకొక్క యూనిట్ విలువ రూ.1850 కాగా సబ్సిడీ రూ.1250 ప్రభుత్వం అందిస్తోంది. పెంపకం దారు తనవంతు వాటాగా రూ. 650 చెల్లించాల్సి ఉంటుంది. ఒక్క యూనిట్‌లో 25 కోడిపిల్లలు ఉంటాయి. కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, గ్రామస్తులు శ్రీనివాస్‌గౌడ్, రామన్నయాదవ్, కాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జైనథ్: మండలంలోని పార్డి(కె), జైనథ్ గ్రామాల్లో 75శాతం సబ్సిడీపై 39మంది లబ్ధిదారులకు రెయిన్ బో జాతికి చెందిన కోడి పిల్లలను పశువైద్యాధికారి వినోద్ దేశ్‌పాండే పంపిణీ చేశారు. శుక్రవారం జైనథ్‌కు చెందిన 31 మందికి, పార్డి(కె)కు చెందిన 8మందికి ఒక్కొక్కరికి 25 పిల్లలను అందించారు.

జయప్రదం చేయండి

కైలాస్‌నగర్: ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్లమెంటు నియోజకవర్గం పరిశీలకులు కె. సాంబశివరావు, పార్లమెంట్ అధ్యక్షుడు గుల్లపల్లి ఆనంద్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదిలాబాద్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు అల్లూరి రాజారెడ్డి, సి.భూమన్న, జి.ఓమన్న, అల్లూరి సంతోష్‌రెడ్డి, ప్రభాకర్, రాజేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంతో పాటు గుడిహత్నూర్, ఆదిలాబాద్ రూరల్ మండలాల్లోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ల మరమ్మతుల కారణంగా శనివారం ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆయా మండలాల ఏఈలు డి.శ్రీనివాస్, టి.గౌతమ్, కె.తిరుపతి రెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలోని ఓల్డ్ హౌజింగ్ బోర్డు, కుమ్మరివాడ, శాంతినగర్, పాలిటెక్నిక్ కళాశాల, అటెండర్స్ కాలనీలో మధ్యాహ్నం 12.30గంటల నుంచి 2గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. గుడిహత్నూర్ మండలంలో తోషం, గుడిహత్నూర్, దామన్‌గూడ, డొంగర్‌గాంవ్, కోల్హారీ, ముత్నూర్‌లో ఉదయం 11.30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండల పరిధిలోని పొచ్చెర, దిమ్మ, జందాపూర్, భీంసరి గ్రామాలకు ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు అంతరాయం కలుగుతుందన్నారు.

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవం

తాంసి: మండల కేంద్రంలోని విద్యానగర్ కాలనీలోని సాయిబాబా ఆలయ వార్షికోత్సవం నేటి నుంచి వైభవంగా ప్రారంభకానున్నాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. హోమం, అర్చన, అగ్నిగుండం ప్రవేశం, శివ పార్వతుల కల్యాణం, ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సాయిబాబాను దర్శించుకోవాలని ఆలయకమిటీ అధ్యక్షుడు అశోక్ రెడ్డి కోరారు.

నేడు ఎమ్మెల్యే రాక

బజార్‌హత్నూర్: మండలంలోని గిర్నూర్ గ్రామంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి శనివారం ఉదయం 11 గంటలకు బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు రానున్నట్లు బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ కానిందే రాజారాం తెలిపారు. అధికారులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

నేడు సమావేశం

బజార్‌హత్నూర్: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం ఉదయం 7.30 గంటలకు పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులను ఎంఈవో శ్రీకాంత్ ఆదేశించారు. పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో అవగాహన కల్పించనున్నారు.

నేడు రుణాల ఎంపికకు లక్కీ డ్రా

జైనథ్: మండల కేంద్రంలోని రైతువేదికలో రుణాల ఎంపిక కోసం లక్కీ డ్రా నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గజానన్ రావ్ తెలిపారు. జిల్లా మైనార్టీ వెల్ఫేర్, జిల్లా మహిళ, శిశు, వికలాంగుల సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వికలాంగులు, మైనార్టీలు పాల్గొనాలని కోరారు. ఒక్కొక్క శాఖలో 2 చొప్పున మొత్తం 4 యూనిట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


24 నుంచి రుద్రా సహిత శతచండీయాగం

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణంలోని దుర్గానగర్‌లో గల నవశక్తి దుర్గామాత మందిరంలో ఈ నెల 24 నుంచి 26 వరకు శ్రీరుద్రా సహిత శత చండీయాగం నిర్వహించనున్నట్లు పూజారి కిషన్ మహరాజ్ తెలిపారు. శుక్రవారం దుర్గా మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. లోక కల్యాణార్థం, విశ్వశాంతి కోసం 108 యజ్ఞ కుండలతో తిరుపతి వేద పాఠశాలకు చెందిన వేద పండితులచే ఈ మహాయాగం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతిరోజు ఉదయం నుంచి హోమం, పూజ, హారతి, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సమావేశంలో ట్రస్ట్ సభ్యులు దాసరి అరుణ్, శ్రీనివాస్ యాదవ్, రవి కుమార్ పాల్గొన్నారు.

22 వరకు శనగ కొనుగోళ్లు బంద్

బోథ్: వాతావరణంలో మార్పుల కారణంగా ఈనెల 22 వరకు బోథ్ మార్కెట్ పరిధిలో శనగ కొనుగోళ్లు నిలిపివేయనున్నట్లు సెంటర్ ఇన్‌చార్జి నాగభూషణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈవిషయాన్ని రైతులు గమనించాలని కోరారు.

వృథాగా భగీరథ నీరు



అంబేద్కర్ చౌక్ వద్ద వృథాగా పోతున్న భగీరథ నీరు

ఇంద్రవెల్లి: మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యంతో గ్రామాలకు భగీరథ నీరు సక్రమంగా అందడం లేదు. అక్కడక్కడ పైప్‌లైన్ లీక్ అయినా అధికారులు పట్టించుకోకపోవడంతో సక్రమంగా నీటి సరఫరా కావడం లేదు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ప్రధాన రహదారి వద్ద, మండలంలోని లిమ్‌గూడలో పైపులైన్ లీకేజీ అయి నీరు వృథాగా పోతోంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



లిమ్‌గూడ ట్యాంక్ వద్ద..